# గ్రూప్-2 పోస్టులు యథాతథం

- **గ్రూప్-1లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల విలీనానికి 'నో'**
- **ఏపీపీఎస్సీ సిఫారసుకు సీఎం అంగీకారం**
- **త్వరలో జీ.వో.నెం. 622, 623లకు సవరణలు**

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. గ్రూప్-2 సర్వీసెస్ పోస్టులు యథాతథంగా ఉండనున్నాయి. గ్రూప్-2 సర్వీసెస్‌లోని ఎగ్జిక్యూటివ్ పోస్టులు గ్రూప్-1 సర్వీసెస్‌లో విలీనం కావడం లేదు. వాటిని గ్రూప్-1 బి సర్వీసెస్ కింద పరిగణిస్తూ 2012 డిసెంబరులో జారీచేసిన జీ.వో.నెం. 622,623లను ప్రస్తుతానికి అమలు చేయవద్దని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చేసిన సిఫారసుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైలుపై సంతకం చేశారు. దీంతో గ్రూప్-2 సర్వీసెస్ పోస్టులను యథాతథంగా ఉంచుతూ జీవో నెం.622, 623లకు ప్రభుత్వం సవరణలు చేయనుంది.

వివిధ ప్రభుత్వ విభాగాల్లోని భర్తీ చేయాల్సిన ఖాళీ పోస్టులకు సంబంధించి ఆర్థికశాఖ ఉత్తర్వులు విడుదల చేసిన నేపథ్యంలో జీ.వో.నెం.622,623లపై స్పష్టత ఇవ్వాలని తొలుత ప్రభుత్వానికి ఏపీపీఎస్సీ లేఖ రాసింది. ఆయా జీవోల ప్రకారం.. గ్రూప్-2 సర్వీసెస్‌లోని ఎగ్జిక్యూటివ్ పోస్టులను కట్ చేసి, గ్రూప్-1 సర్వీసెస్‌లో విలీనం చేసి, వాటిని గ్రూప్-1బి సర్వీసెస్‌గా పరిగణించాల్సి ఉంటుంది. అంటే, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు మాత్రమే గ్రూప్-2లో ఉంటాయి. గ్రూప్-1ఎ, గ్రూప్-1బి.. ఈ రెండు సర్వీసెస్‌లకు ఒకే పరీక్ష నిర్వహిస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ జీవోల అమలుపై నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఏపీపీఎస్సీ ఈ విషయాన్ని సర్కారు దృష్టికి తీసుకెళ్లింది.

ఏపీపీఎస్సీ రిక్రూట్‌మెంట్లలో సంస్కరణలకు గ్రూప్-2లోని ఎగ్జిక్యూటివ్ పోస్టులన్నింటినీ గ్రూప్-1లో విలీనం చేయాలని, గ్రూప్-1ను గ్రూప్-1ఎ, గ్రూప్-1బీ లుగా విభజిస్తూ కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అప్పట్లోనే ఈ ఉత్తర్వులను నిరుద్యోగులు వ్యతిరేకించారు. గ్రూప్-1ఎ, గ్రూప్-1 బీ సర్వీసెస్‌లోని ఉద్యోగాలకు ఒకే పరీక్ష నిర్వహిస్తూ .. ఒక్క మార్కు తేడాతో వారి స్థాయిలు మారిపోయేలా చేయడం సరికాదన్నారు.

గ్రూప్-2లోని పోస్టులకు 450 మార్కులకు ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహించి, గ్రూప్-1బీ లోని పోస్టులకు 825 మార్కుల (రాత పరీక్ష 750 మార్కులు+ ఇంటర్వ్యూ 75 మార్కులు)కు డిస్క్రిప్టివ్ పరీక్ష నిర్వహించడం ఎంతవరకూ సమంజసమన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అప్పట్లో ఇంటర్వ్యూల విధానంలోనూ మార్పులు తీసుకువచ్చారు. అప్పటి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జె.సత్యానారాయణ కమిటీ చేసిన సిఫారసుల్లో భాగంగా... రాష్ట్ర స్థాయి సర్వీసెస్‌లతో పాటు గ్రూప్-1, డిగ్రీ కాలేజి లెక్చరర్స్, పాలిటెక్నిక్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్, అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, డీఎస్పీ(కమ్యూనికేషన్స్).. ఈ పోస్టులకు మాత్రమే ఇంటర్వ్యూలు నిర్వహించాలి. ఇతర పోస్టులకు రాత పరీక్షల నిర్వహణ ద్వారా మెరిట్ ప్రాతిపదికగా ఉద్యోగాలు ఇవ్వాలని నివేదించింది. మొత్తం మీద అప్పటి జీవో.నెం.622, 623 లపై నిరుద్యోగుల నుంచి వచ్చిన వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం.. ఏడాది పాటు వాటిని అమలు చేయబోమని ప్రకటించింది.

2014 నుంచి అమలు చేసేలా 2013 జూలైలో జీవో.నెం. 556 విడుదల చేసింది. కానీ ఆ తర్వాత కొత్త నోటిఫికేషన్లు గానీ రిక్రూట్‌మెంట్లు గానీ చేపట్టలేదు. ప్రస్తుతం కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయనున్నందున ఏపీపీఎస్సీ అప్రమత్తమై దీనిపై స్పష్టతిచ్చింది.